ప్రజాశక్తి
శనివారం 20 డిసెంబర్ 2025 | 5 | విజయనగరం



యూరియా కోసం పడిగాపులు


యూరియా కోసం బారులు తీరిన రైతులు

ప్రజాశక్తి-మెరకముడిదాం

యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గత కొద్దిరోజులుగా యూరియా కొరత వెంటాడుతోంది. మండలంలో 16 రైతుసేవా కేంద్రాలు ఉండగా 7 రైతు భరోసా కేంద్రాలకు మాత్రమే 24 టన్నులు యూరియా శుక్రవారం వచ్చింది. దీంతో రైతులు యూరియా కోసం పరుగులు తీశారు. మరో 9 రైతు భరోసా కేంద్రాలకు యూరియా రాక రైతుల అవస్థలు పడుతున్నారు. బ్లాక్ మార్కెట్లో యూరియా బస్తాకు 700 రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారు. అధికారులు స్పందించి బ్లాక్ మార్కెట్‌లో కాకుండా ఆర్‌ఎస్‌కెల ద్వారా పంపిణీ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు

గాంధీ విగ్రహాల వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు



విజయనగరం కలెక్టరేట్ వద్ద గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, గజపతినగరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ, పేరు మార్పును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం జిల్లాలో పలుచోట్ల ఉపాధి కూలీలు ఆందోళనలు చేశారు. గాంధీ విగ్రహాల వద్ద నిరసనలు తెలిపి వినతులు అందజేశారు. కలెక్టరేట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద జరిగిన నిరసనను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడారు. ఉపాధి హామీ చట్టంలో హక్కులను కాలరాసేందుకే మహాత్మా గాంధీజీ పేరు మీద ఉన్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తొలగించి పథకం మార్చారని అన్నారు. మహాత్మా గాంధీజీ మీద ఉన్న వ్యతిరేకతతోనే వామపక్షాలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టానికి బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచిఉపాధి హామీ చట్టంపై దాడి చేస్తుందని అన్నారు. ఉపాధి హామీకి 90శాతం నిధులు ఇచ్చే కేంద్ర ప్రభుత్వం ఆ నిధులను 60శాతానికి కుదించిందని, దీనివల్ల ఆ భారం రాష్ట్రాలపై పడుతుందని అన్నారు. ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడంపై టిడిపి, జనసేన పార్టీలు స్పందించాలని అన్నారు. ఈ చట్టాన్ని మార్చడం వల్ల గ్రామీణ పేదలు కూలీలు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఉపాధి చట్టాన్ని యథావిధిగానే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్, వెంకటేష్ విజయనగర పట్టణ నాయకులు బి. రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి పథకంగా మార్చాడాన్ని విరమించుకోవాలని డిమాండ్‌చేస్తూ గజపతినగరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద, బంగారమ్మపేట, గుడివాడలో అంబేద్కర్ విగ్రహాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి. శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కూలీలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసే కుట్రలకు కంకణం కట్టుకుందన్నారు. అందుకే క్రమక్రమంగా చట్టానికి తూట్లు పొడుస్తూ వంద రోజులు పని హక్కు గ్యారెంటీని తీసివేసిందన్నారు. ఇది ఒక పథకంగా కేంద్ర ప్రభుత్వ దయాదక్షిణ్యాలపై ఆధారపడే విధంగా ఉపాధి హామీని తయారు చేశారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొని బడ్జెట్ భారమంతా రాష్ట్రాలపై నెట్టేస్తున్నదని తెలిపారు. మహాత్మా గాంధీ పేరును తీసివేసి గాంధీ గౌరవాన్ని మన దేశ గౌరవాన్ని అవమానిస్తున్నారని అన్నారు. చట్టబద్ధత కోల్పోవడం అంటే భవిష్యత్తులో పని రోజులు కోల్పోవడం, నిరుద్యోగ భృతి హక్కును కోల్పోవడం జరుగుతుందని, కావున తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టి. కనకరాజు, కోటి మహంకాళి,టి.రాము, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : నిమ్మలపాలెం సచివాలయం వద్ద సిపిఎం జిల్లా నాయకులు గాడు అప్పారావు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పాలరైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, బి.కళావతి, జి.సంతోషి, టి.లక్ష్మి, ఎ.దేవుడమ్మ, పి.రమణమ్మ, ఎన్.లక్ష్మి, పి.రాము పాల్గొన్నారు.


కొత్తవలస.. గాంధీ విగ్రహానికి వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు, కూలీలు

మెంటాడ : మెంటాడ సచివాలయం వద్ద మహాత్మా గాంధీ, బిఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు ఆధ్వర్యాన ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేశారు. లోతుగెడ్డ గ్రామంలో సిహెచ్ కృష్ణవేణి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు గేదెల పెదరాము, సబ్బవరపు సింహాచలం, ఈది బిల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : జరజాపుపేటలో గాంధీ విగ్రహం వద్ద సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్.పైడిరాజు, బి.శంకరరావు, ఎం.కృష్ణ, టి.వెంకట్రావు, బి.రాము తదితరులు పాల్గొన్నారు.






గజపతినగరం, మెంటాడ, నెల్లిమర్లలో గాంధీ విగ్రహాల వద్ద నిరసనలు తెలుపుతున్న సిపిఎం నాయకులు, ఉపాధి కూలీలు

రైస్‌మిల్లుల్లో ఆర్‌డిఓల తనిఖీలు


మిల్లు యజమానితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కీర్తి

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని సవరవిల్లిలో శుభకరి రైస్ మిల్లును ఆర్‌డిఒ దాట్ల కీర్తి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులో నిర్వహిస్తున్న ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలించారు. రికార్డులు, స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. ధాన్యం రవాణాకు సంబంధించి ట్రక్ షీట్లను ఎప్పటికప్పుడు అంగీకరించాలని మిల్లర్‌కు సూచించారు. ప్రభుత్వానికి అందాల్సిన సిఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ధాన్యం నిల్వలు, లెక్కల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ తనిఖీలో ఎంఆర్‌ఐ ఎం.రమణమ్మ, సిఎస్ డిటి మురళి, తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి : మండలంలో ధాన్యం కొనుగోలుపై ఆర్‌డిఒ జి.వి.సత్యవాణి దృష్టిసారించారు. తాలాడ గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రం, లక్ష్మి శ్రీనివాస్ రైస్ మిల్లును శుక్రవారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన ట్రక్ షీట్ పెండింగ్ అంశంపై అధికారులను ఆరాతీశారు. బ్యాంక్ గ్యారెంటీ లేకపోవడంతో నిలిచిపోయిన ట్రక్‌షీట్లను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం విక్రయానికి వచ్చే రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.సుదర్శన్‌రావు, సిఎస్ డిటి అనంత కుమార్, డిప్యూటీ తహశీల్దార్ ఆర్.మధు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మిల్లులో తనిఖీలు చేస్తున్న ఆర్‌డి సత్యవాణి

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

కంటోన్మెంట్ : జిల్లాలో ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను అమలు చేస్తుందని పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ బి.శాంతి తెలిపారు. ఖరీఫ్ 2025-26 సీజనులో నేటి వరకు జిల్లాలోని 359 రైతు సేవా కేంద్రాల ద్వారా సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 37,800 మంది రైతుల నుండి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యానికి గాను రూ.373 కోట్లు నేరుగా రైతులబ్యాంకు ఖాతాలలో జమ చేశామని, ఆర్‌ఎస్‌కెల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయించడంలో దళారులను ఆశ్రయించ కుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ధాన్యం విక్రయంలో రైతుల నుండి అదనపు కిలోలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో పలు మిల్లులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు.

ఖోఖో కోచ్‌గా రవికుమార్

ప్రజాశక్తి-శృంగవరపు కోట

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -19 ఖోఖో రాష్ట్ర జట్టు కోచ్‌గా లక్కవరపుకోట మండలం గంగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ గాడి రవికుమార్ నియమితులయ్యారు. అండర్-19 జాతీయస్థాయి ఖోఖో పోటీలు మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో ఈ నెల 23 నుంచి జరుగుతాయి. రవికుమార్ నియామకంతో ఎస్‌జిఎఫ్ కార్యదర్శి పివిఎల్ఎన్ కృష్ణ, సహ కార్యదర్శి రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శారదాదేవి, తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రేపు పల్స్ పోలియో

- విజయవంతం చేయాలని అవగాహన ర్యాలీ
- జిల్లా వ్యాప్తంగా 1,99,386 మంది చిన్నారులు లక్ష్యం
- 2360 బృందాలు ఏర్పాటు
- ఒపివి వాక్సిన్ డోసులు 2,45,667 సిద్ధం
- డిఎంహెచ్‌ఒ జీవనరాణి


ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ జీవనరాణి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా వ్యాప్తంగా ఈనెల 21న జరిగే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ జీవనరాణి శుక్రవారం పాత్రికేయుల సమావేశంలో కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రచార పోస్టరును ఆమె విడుదల చేసారు. ముందుగా ఆమె పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని తెలిపారు. 2014లో ప్రపంచ ఆరోగ్య సంస్థ పోలియో నివారణ దినోత్సవం నిర్వహించి కొనసాగిస్తుందని తెలిపారు. 1999 లో చివరిసారిగా జిల్లాలో కర్లాం, ముంజేరులో రెండు పోలియో కేసులు నమోదయ్యాయని తెలిపారు. పల్స్ పోలీపయో కార్యక్రమానికి ఒపివి. వాక్సిన్ డోసులు 2,45,667 సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి 1180 బూతులు, 2360 బృందాలు, 129 మంది సూపర్‌వైజర్లను, 66 మెబైల్ టీములను, 21 ట్రాన్సిట్ టీములను, 56 కోల్డ్ చైన్ టీములను ఏర్పాటు చేసామని తెలిపారు. జిల్లాలో మైదాన ప్రాంతంలో 1,62,293 మంది చిన్నారులకు 972 బూతులు, పట్టణ ప్రాంతంలో 1,07,612 మంది చిన్నారులకు 179 బూతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాంలో 10,810 మంది చిన్నారులకు 29 బూతులు ఏర్పాటు చేసి, 58 బృందాలు ఏర్పాటు చేసామని చెప్పారు. మురికివాడలు, సంచార తెగలు, ఇటుక బట్టీలు, కట్టు పనివారు, ఇతర, చేరుకోలేని ప్రాంతాలలో కూడా పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాటుల చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషను అధికారి డాక్టర్ అచ్యుతకుమారి, అదనపు డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ కె.రవి, డిఇఎంఒ వి.చినతల్లి, డిపిహెచ్ ఎన్ఒ జి.వి.సావిత్రి, పిఒ ఎన్‌సిడి డాక్టర్ బివివి సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

విద్యార్థుల్లో సృజనాత్మకత ఆలోచనను పెంపొందించేందుకు దోహదం : డిఇఒ మాణిక్యం నాయుడు


విజేతలను అభినందిస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలికలు హైస్కూల్ లో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జెడ్‌పి, ప్రభుత్వ, మోడల్ స్కూల్స్, కెజిబివి విద్యార్థులు తయారు చేసిన సైన్సు ప్రదర్శనలు ఆలోచింపజేసాయి. డిఇఒ యు.మాణిక్యంనాయుడు ఈ ప్రదర్శనను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 250కు పైగా ప్రదర్శనలను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ఎంతో దోహద పడుతుందన్నారు. సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా మెరుగైన సమాజం కోసం ఎటువంటి ప్రాజెక్టులు అవసరం అనేది విద్యార్థి దశనుంచి అలవర్చుకోవడం ద్వారా మెరుగైన సమాజం ఏర్పాటులో భాగస్వాములు అయ్యేందుకు వీలుగా ఉంటుందన్నారు. సైన్స్ ద్వారానే మెరుగైన సమాజం ఏర్పడుతుందని విద్యార్థుల ప్రదర్శనలు నిరూపించాయన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. ఆర్‌డిఒ కూడా కీర్తి కూడా ఈ ప్రదర్శనలను తిలకించి వాటి ఉపయోగాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానాల్లో నిలిచిన ప్రదర్శనలను రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్‌కు పంపుతారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ వెంకటరమణ, సైన్స్ కో ఆర్డినేటర్లు రాజేష్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటగిరిల వారీ విజేతలు

చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులు (క్రాప్ డాక్టర్ సస్టయినబుల్ అగ్రికల్చర్) , జామి జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు (పర్యావరణ నిర్వహణ, పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలు, రామభద్రపురం జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు (గ్రీన్ ఎనర్జీ- ఈవి ఛార్జింగ్ స్టేషన్), వల్లాపురం జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు (అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు), రామతీర్థం జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు (నీటి సంరక్షణ, డ్రెయిన్ ఓవర్ గుర్తింపు వ్యవస్థ), కెల్ల జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు (ఆరోగ్యం, పరిశుభ్రత), కొండవెలగాడ జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు (వాటర్ లీకేజి, డ్రెయిన్‌ఓవర్ ఫ్లో డిటెక్షన్ సిస్టమ్) ప్రదర్శనలు ఆయా విభాగాల్లో ఎంపికయ్యాయి. ఉపాధ్యాయుల కేటగిరీలో బల్లా శ్రీనివాసరావు (రామతీర్థం జెడ్‌పి హైస్కూలు) నీటి పొదుపు మరియు పరిశుభ్రతకు పర్యావరణ హిత స్థూపాకార యూరినల్ బ్లాక్ డిజైన్, పి.స్వప్న, (కొట్టాం జెడ్‌పి హైస్కూల్) గ్రీన్ ల్యాబ్ ఎంపికయ్యాయి.



కొండవెలగాడ హైస్కూల్ విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రాజెక్టు

ఎస్‌పి దామోదర్‌రెడ్డికి ఎబిసిడి అవార్డు



డిజిపి నుంచి అవార్డు స్వీకరిస్తున్న ఎస్‌పి దామోదర్‌రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ప్రకాశం జిల్లాలో జరిగిన తెలుగుదేశం మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసును చేధించినందుకు గాను విజయనగరం జిల్లా ఎస్‌పి ఎఆర్ దామోదర్ (అప్పటి ప్రకాశం జిల్లా ఎస్‌పి)ను రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా అభినందించారు. ఈ మేరకు ఉత్తమ దర్యాప్తు అవార్డు (అవార్డు ఫర్ బెస్ట్ ఇన్ క్రైం డిటెక్షన్), ప్రశంసా పత్రాలను శుక్రవారం డిజిపి చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్రంలో వివిధ జిల్లాలలో పోలీసులు చేధించిన ముఖ్య కేసుల దర్యాప్తును పరిశీలించి, వాటిలో ఉత్తమంగా దర్యాప్తు చేసిన కేసులకు ఇచ్చే ఎ.బి.సి.డి. అవార్డు ఎస్‌పి దామోదర్‌రెడ్డికి దక్కింది. 2025లో రెండవ క్వార్టరుకు వివిధ జిల్లాల కేసుల దర్యాప్తును పరిశీలించి, ప్రకాశం జిల్లా ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్లో నమోదయిన ఈ హత్య కేసును చేధించినందుకు ఎబిసిడి అవార్డు లభించిందని ఎస్‌పి అన్నారు.

గోడ కూలి విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని త్రినేత్ర స్కూల్ భవనంపైనున్న పిట్టగోడ కూలి ఆరో తరగతి విద్యార్థి వేమలి భార్గవ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్కూల్ వెనుక భాగాన వాష్‌రూమ్‌కు శుక్రవారం విద్యార్థి భార్గవ్ వెళ్తుండగా పిట్టగోడ కూలి విద్యార్థి తల, రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. విద్యార్థి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు పాఠశాల కరస్పాండెంట్ గణేష్ తెలిపారు. భవనం యజమాని భవనానికి మరమ్మతులు చేస్తున్నారని, అందులో భాగంగానే గోడ విరిగిపడి ఉండవచ్చునని చెప్పారు.

విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం.. ప్రయివేటు పాఠశాలలపై ఎంఇఒ పర్యవేక్షణ లేక, నిర్లక్ష్య ధోరణి వ్యవహరించడం వల్ల ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కిరణ్ తెలిపారు. నిర్మాణ పనులు చేపడుతున్న భవనంలో తరగతులు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు.

ప్రజాదర్బార్‌తో తక్షణ పరిష్కారం

ఎమ్మెల్యేలు కళా, అదితి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

సమస్యలకు ప్రజా దర్బార్‌తో తక్షణ పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. శుక్రవారం చీపురుపల్లిలోని టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మండలంలోని ఎలకలపేటలో రేషన్ డిపో ఏర్పాటుచేయాలని అలజంగి ఎంపిటిసి సనపతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్థివలస, ఎలకలపేట గ్రామానికి చెందిన వార్డు మెంబర్ గొర్లె పాపారావు, బవిరిగొల్ల, ఎఎంసి డైరెక్టర్ రేవల్ల మల్లేష్, తదితరుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా పింఛన్లు, రేషన్ కార్డులు, సాగునీటి సమస్యలు, మౌలిక సదుపాయాల గురించి ప్రజల నుంచి వినతులు అధికంగా వచ్చాయి. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.త్రిమూర్తుల రాజు, మండల అధ్యక్షులు రౌతు కామ నాయుడు, ఆర్‌ఇసిఎస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, గరివిడి మండలం నాయకులు పైల బలరాం, సురేష్ పాల్గొన్నారు.

విజయనగరంకోట : పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేఅదితి విజయలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 15వ డివిజన్ కు చెందిన కట్టమూరి లక్ష్మి తన కుమార్తె చెవిటిది కావడంతో దాతల సహకారంతో మిషన్ చెవికి పెట్టించామని, ఖర్చు ఏడు లక్షల 50 వేల రూపాయలు కావడంతో సిఎం సహాయ నిధి ఇప్పించాలని కోరారు. కొండకరకాంలో బిఎస్‌ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయించాలని ఆ గ్రామ నాయకులైన మాజీ సర్పంచ్ పి. గౌర్నాయుడు, మాజీ ఎంపిటిసి రాంబాబు, జగదీష్ వినతి అందజేశారు. 35వ డివిజన్‌కు చెందిన వాళ్ల ఉమా గత మూడేళ్లగా ఆన్‌లైన్‌లో తన పేరున 42 ఇళ్లు ఉన్నట్లు చూపించడం వల్ల తన కుమారులకు స్కాలర్‌షిప్ రావడం లేదని, ప్రభుత్వ పథకాలేవీ అందడం లేదని వెంటనే సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజారోగ్య సిబ్బంది నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల వినియోగం, విక్రయాలపై ఆకస్మిక దాడులు చేశారు. క్షేత్రస్థాయిలో చిన్న చిన్న దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ సంచులు, కవర్లు, గ్లాసులు వంటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్నారా లేదా గమనించారు. టిఫిన్ దుకాణాలు, కిరణా షాపులు, పాన్ షాప్ లు, మాంస విక్రయ కేంద్రాల వద్దకు వెళ్లి క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీ కార్యక్రమాలలో ఆయా సర్కిళ్ళ వారీ పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో ఉజ్వల శ్రీవాత్సవ్‌కు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


కళ్యానంద భారతి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల భవిత కేంద్రంలో విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న బాలి ఉజ్వల్ శ్రీవాత్సవ్ రాష్ట్రస్థాయిలో కాకినాడలో నిర్వహించిన 37వ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ పోటీలలో స్వర్ణం, వెండి పతకాలను సాధించాడు, జాతీయస్థాయిలో విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించిన 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ పోటీలలో వెండి పతకాన్ని సాధించాడు. ఆటిజం, మేధో వైకల్యం ఉన్నప్పటికీ ఏకాగ్రతను పెంచుకొని ఈ పోటీలలో నిలదొక్కుకున్నాడు. ఈసందర్భంగా సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ ఎ.రామారావు ఈ విద్యార్థితో పాటు సహిత విభాగ సమన్వయకర్త సూర్యారావు, సహిత విభాగ సహాయ సమన్వయకర్త భారతి, ఈ స్థాయికి తీసుకొని వచ్చిన భవిత రిసోర్స్ ఉపాధ్యాయులైన సరస్వతి, గీతను అభినందించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

ప్రజాశక్తి-విజయనగరంకోట

దేశ సర్వతోముఖాభివృద్ధికి చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు అన్నారు. మాజీప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక విటి.అగ్రహారం వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వాజ్‌పేయి విగ్రహాన్ని శుక్రవారం బిజెపిరాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, మంత్రులు సత్యకుమార్ ప్రసాద్, కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం రింగ్ రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వెంకయ్య మాట్లాడారు. విజయనగరం జిల్లా నుంచి చాలా మంది దేశ నేతలుగా ఎదిగారన్నారు. రాజకీయాల్లో పదవుల కోసం పోటీ చేయవచ్చు కానీ.. మచ్చ రాకుండా రాజకీయాలు చేసే వ్యక్తులు చాలా తక్కువ మంది ఉన్నారన్నారు. పాలకులు సుపరిపాలన అందించాలన్నారు. దేశం సర్వతోముఖాభివృద్ధికి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కె.మురళీ మోహన్, కిమిడి కళా వెంకట్రావు, బేబినాయన, ఎన్.ఈశ్వరరావు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, బిజెపి జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ, బిజెపి రాష్ట్ర కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

'ఉపాధి' పేరు మార్పు తగదు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఉపాధి హామీ చట్టం పేరుమార్పు సరికాదని వైసిపి ట్రేడ్ యూనియన్ నాయకులు ధవళ లక్ష్మణరావు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మహాత్మా గాంధీ పేరుతో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తొలగించడం దుర్మార్గమైన చర్యన్నారు. విబి - జి రామ్ జి అని పేరు పెట్టడం గాంధీకి చేసే అవమానమేనని అభిప్రాయ పడ్డారు. ఇది ఎన్‌డిఎ ప్రభుత్వం గాంధీకి ఇస్తున్న గౌరవమా? అని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి హామీ అనే పేరు తొలగించడం సిగ్గుచేటని, ఇది పేదలపై, కార్మిక వర్గాలపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న సిగ్గుమాలిన చర్యలలో ఒకటని విమర్శించారు. కార్మిక చట్టాలను పూర్తిగా విస్మరిస్తూ, కార్మికుల జీవితాలను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ఎంపిలు పార్లమెంట్లో దీనిపై గట్టిగా ప్రశ్నించారని, కానీ టిడిపి ఎంపిలు పేదల పక్షాన నిలబడలేదని ఆరోపించారు. ప్రతి వారం జోలు పట్టుకొని సిఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి వందల కోట్లు తెస్తున్నారని చెబుతున్నా, గ్రామీణ ఉపాధి హామీ గురించి ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు

సింగరాయిలో వెలిగిన వీధి దీపాలు

ప్రజాశక్తి-వేపాడ



వీధిలైట్లు ఏర్పాటును పర్యవేక్షిస్తున్న కార్యదర్శి సత్యవతి

మండలంలోని సింగరాయి గ్రామంలో దాదాపు రెండు నెలల తరువాత వీధి దీపాలు ఏర్పాటయ్యాయి. గ్రామంలో ఎస్‌సి కాలనీతోపాటు ప్రధాన వీధుల్లో కూడా వీధిలైట్లు వెలగక సుమారు గ్రామస్తులు అంధకారంలో చిక్కుకున్నారు. ఇటీవల కాలంలో ఆ గ్రామంలో ఎంపిడిఒ సూర్యనారాయణ పర్యటన సందర్భంగా వీధి దీపాల సమస్యను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వీధిదీపాలు వెలిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి సత్యవతిని ఎంపిడిఒ ఆదేశించారు. ఈ విషయాన్ని కార్యదర్శి సర్పంచ్ వెంకటరావుతో చెప్పి గురువారం గ్రామంలో వీధి లైట్లు అన్ని వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


ప్రజాశక్తి-దత్తిరాజేరు

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సిడిపిఒ రాజేశ్వరి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శివాజీ ఆధ్వర్యంలో ఎన్‌జిఒ సఖి వైద్య సిబ్బంది, అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలకు శుక్రవారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల అనర్థాలు, జరిగే పరిణామాలు గురించి వివరించారు. గ్రామాల్లో 11 మంది సభ్యులను కమిటీని నియమించి ప్రజలకు బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించాలన్నారు. చట్టాన్ని ఎవరైనా అతిక్రమించి బాల్య వివాహాలు చేస్తే వారిపై లక్ష రూపాయలు జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 సుధాకర్, వైద్యాధికారి వెంకటరమణ, న్యాయవాది సాయి శేఖర్, సూపర్‌వైజర్ శకుంతల పాల్గొన్నారు.

బొబ్బిలి పర్యటన ఆనందంగా ఉంది

బిఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

ప్రజాశక్తి -బొబ్బిలి



బొబ్బిలి యుద్ధంలో ఉపయోగించిన కత్తితో మల్లారెడ్డి

బొబ్బిలి పర్యటన ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలంగాణ మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి అన్నారు. బొబ్బిలి కోటను శుక్రవారం సందర్శించారు. యుద్ధ ఆయుధాలతో ఏర్పాటు చేసిన మ్యూజియాన్ని పరిశీలించారు. యుద్ధ చరిత్ర, ఆయుధాల గురించి ఎమ్మెల్యే బేబినాయన వివరించారు. 200 ఏళ్ల కిందట సామగ్రి భద్రపరచడం అభినందనీయమన్నారు. మల్లారెడ్డిని బేబినాయన సన్మానించి బొబ్బిలి వీణను బహూకరించారు. ఆయనతో లోకబంధు విద్యా సంస్థల అధినేత తూముల భాస్కరరావు ఉన్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-రాజాం

స్థానిక ఏరియా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులకు సకాలంలో వేతనాలు అందజేయాలని మెడికల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు, జిల్లా అధ్యక్షులు బుగత అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. సిబ్బందిని తగ్గిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు యాదవ్, నీలకంఠేశ్వరరావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలో నూతన కోర్టు భవన నిర్మాణ పనులను శుక్రవారం జిల్లా జడ్జి భవిత పరిశీలించారు. భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. నిర్మాణ పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి హేమ స్రవంతి జానకిరామ్, ఎడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం రోహిణిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మచ్చ ఆనంద్ కుమార్, జనరల్ సెక్రెటరీ బిఎస్ఆర్ మూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రగ్స్ భూతంపై ఐక్య పోరాటం

ప్రజాశక్తి-చీపురుపల్లి

సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్ భూతంపై ఐక్యంగా పోరాడి శాశ్వతంగా నిర్మూలిద్దామని సిఐ జి.శంకర్రావు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల వారి ఉజ్వల భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. గంజాయి అమ్మినా, రవాణా చేసినా కఠినమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎల్.దామోదర్ రావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ వల్లూరి బంగారు నాయుడు, ఎఒ గేదెల రామునాయుడు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు నెల్లిమర్లకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు నెల్లిమర్ల రిక్రియేషన్ ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు కె.సురేష్, మజ్జి నాని తెలిపారు. ఎంపికైన బి.రామకృష్ణ, బి.వరుణ్, డి.ప్రదీప్ కుమార్‌ను వారు అభినందించారు. జాతీయ స్థాయిలో సత్తాచాటాలని కోల చంద్రశేఖర్ ఆకాంక్షించారు.

విద్యార్థులకు టీషర్టులు, ఐడి కార్డులు వితరణ

ప్రజాశక్తి-జామి

మండలంలోని విజినిగిరి హైస్కూల్లో 58 మంది విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు టీషర్టులు, ఐడి కార్డులు అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు కొవ్వాడ సన్యాసినాయుడు, సెక్రటరీ మిడతాన తాతమనాయుడు, కిలారి శ్రీనివాసరావు, కొవ్వాడ చంద్రశేఖర్ కుమార్, సర్పంచ్ కిలారి సూర్యారావు, మాజీ సర్పంచ్ కొమ్మనేని శ్రీను, వైస్ సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

కొత్తవలస : తుమ్మికాపల్లి పంచాయతీలో శుక్రవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ విరోతి కొండలరావు, పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్ పర్యవేక్షించారు. హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎంఎల్‌హెచ్‌పి కామేశ్వరి, ఎఎన్ఎం గౌరీ, ఆశా వర్కర్స్ దత్తి లక్ష్మి, జగదీశ్వరి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి-రాజాం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం పట్టణ పరిధిలో రూ..28.57 లక్షల వ్యయంతో మంజూరైన సిసి రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైప్‌లైన్లకు శంకుస్థాపనలు చేశారు. కాంపెక్ట్ డస్ట్ బిన్స్, చెత్త సేకరణ బళ్లను ప్రారంభించారు. రాజాం నగరపాలక సంస్థలో పనిచేసిన అవుట్ సోర్సింగ్ పిహెచ్ వర్కర్ పడాల వేణు ఇటీవల మృతి చెందడంతో ఎక్స్‌గ్రేషియా కింద రూ.2 లక్షలు మంజూరు చేయించడంతోపాటు దహన సంస్కారాలకు రూ.15 వేల చెక్కును అతని భార్య పడాల నాగమ్మకు అందజేశారు. రాజాం హైస్కూల్‌లో స్నేహం అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం స్థానిక టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి, 40కి పైగా వినతులు స్వీకరించారు. రేగిడి మండలం గుల్లపాడు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త నారు జనార్ధన ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆ కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమాను అందజేశారు. కార్యక్రమాల్లో ఎంఇఒ దుర్గారావు, కమిషనర్ రామచంద్రరావు, మేనేజర్ శ్రీనివాసరావు, ఎఇ వెంకట రాజ్, ఆర్ఐ ఈశ్వరమ్మ, నాయకులు బొత్స వాసుదేవరావు నాయుడు, నంది సూర్య ప్రకాశరావు, గురవాన నారాయణ రావు, పిన్నింటి మోహన రావు, కిమిడి అశోక్ కుమార్, సుమల వెంకట మన్మధరావు, గట్టి భాను, దుప్పల పూడి శ్రీను పాల్గొన్నారు.

'చలో విశాఖ'ను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

సిఐటియు జాతీయ మహాసభ సందర్భంగా జనవరి నాలుగో తేదిన విశాఖలో జరిగే భారీ బహిరంగ సభకు తరలిరావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు కోరారు. శుక్రవారం పిరిడి పిహెచ్‌సి పరిధిలో ఆశా వర్కర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కార్మిక వర్గం, వ్యవసాయ కార్మికులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటాల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. చలో విశాఖకు కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున కదలాలని ప్రచారం చేశారు.



సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎస్ఐ

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పారా జూనియర్, సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం అభినందించారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధి పూసపాటి ప్రతాప్ వర్మ, భవిత కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని నగరపాలక సహాయ కమిషనర్ అప్పలరాజు కోరారు. పన్ను వసూళ్ళపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం డివిజన్ల వారీగా టీములను ఏర్పాటు చేసి రెవెన్యూ వసూళ్లను ముమ్మరం చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు, నీటి చార్జీలు, డిఅండ్ఒ లైసెన్స్ ఫీజులు వంటివి సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి దోహదపడాలని కోరారు. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికల్లా లక్ష్యాలను అధిగమించాలని సిబ్బందికి ఆదేశించామన్నారు.

నేడు ఎల్.కోటలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

లక్కవరపుకోటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చని చెప్పారు. అర్జీల తక్షణ పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించనున్నట్లు చెప్పారు.

పోలియో చుక్కలు తప్పనిసరి

ప్రజాశక్తి- తెర్లాం

21న మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని పిహెచ్‌సి వైద్యాధికారులు పెద్దింటి వంశీకృష్ణ, రెడ్డి స్వాతి తెలిపారు. శుక్రవారం తెర్లాం పిహెచ్‌సి వద్ద వారు మాట్లాడుతూ తెర్లాం పిహెచ్‌సి పరిధిలో 19 పోలియో బూత్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెర్లాం కాంప్లెక్సులో ట్రాన్సిట్ బూత్ గాను, మరొకటి మొబైల్ వాహనం ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ఏర్పాటు చేశామని తెలిపారు.


పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్లు, నిర్వహణ, కిచెన్ గార్డెన్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.రామసత్యం, సిఆర్ఎంటి కె.రామప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

దత్తిరాజేరు: మండలంలోని పెద మానాపురం బిసి కాలనీలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభానికి ఎక్కువ సర్వీస్ వైర్లు వేలాడి ఉన్నాయి. స్తంభం ఒరిగి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులకు, జూనియర్ లైన్‌మేన్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం



ధర్నా చేస్తున్న సిఐటియు, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు, కార్మికులు

సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దుచేయాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి వి. రాములు మాట్లాడారు. సుందరయ్య సస్పెన్షన్‌ను రద్దు చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు చోడవరపు వెంకటరావు, డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె రఫీ, ఎ.చంద్రయ్య, సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బూరాడలో భూ వివాదంపై కొట్లాట

ప్రజాశక్తి-రేగిడి



ఘర్షణకు దిగిన ఇరు కుటుంబాలు

మండలంలోని బూరాడ గ్రామంలో భూ వివాదంపై శాసపు చిన అప్పలనాయుడు, లుకలాపు నారాయణమ్మ కుటుంబ సభ్యులు శుక్రవారం ఘర్షణ పడ్డారు. లుకలాపు నారాయణమ్మ ఆధీనంలో ఉన్నట్లు చెబుతున్న ఖాళీ స్థలంలో ఆమె కుటుంబ సభ్యులు గ్రావెల్ వేస్తుండగా శాసపు చిన అప్పనాయుడు, దాలినాయుడు, సత్యంనాయుడు, రెడ్డి మధుసూదనరావు కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. పంట పొలాలకు నీరు వెళ్ల కుండా గ్రావెల్ వేస్తున్నారని అడ్డుచెప్పారు. దీంతో ఇరు కుటుంబాలు తోపులాటకు దిగాయి. అనంతరం కర్రలతో కొట్లాటకు దారితీసింది. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని, గొడవను సద్దుమణిగించారు. ఈ ఘటనపై ఇరువురు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఇదే స్థలం వివాదంపై గతంలో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ భూమిపై రెవెన్యూ, పోలీస్ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపడితే గాని కొలిక్కి వచ్చే అవకాశం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య పనితీరును గమనించారు.పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. రహదారులపై చెత్తాచెదారాలు నిల్వ ఉండరాదని సూచించారు. నిర్ణీత సమయానికి విధులకు హాజరై పనులు ముగించుకోవాలని చెప్పారు. దోమలు అధికంగా ఉన్న ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలన్నారు. అయ్యన్నపేటలోని 52 వ నెంబర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. సంపత్ కుమార్ వివిధ అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ పల్లి నల్లనయ్య అధికారులతో కలిసి హాజరయ్యారు. రెవెన్యూ వసూళ్లు, ఆటోమ్యూటేషన్, యానిమల్ భర్త్ కంట్రోల్, అన్నా క్యాంటీన్ల నిర్వహణ, ట్రాఫిక్ సిగ్నల్స్ , సి.సి. కెమెరాల ఏర్పాట్లు, స్వచ్ఛ సర్వేక్షణ, ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఎంవిజిఆర్‌లో వర్క్‌షాప్

ప్రజాశక్తి-డెంకాడ



మాట్లాడుతున్న గ్లాడిస్ ఎవాంజెలిన్

ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యాన ఆధునిక కాలంలో యువత మానసిక ఆరోగ్యంపై వర్క్‌షాప్ నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ గ్లాడిస్ ఎవాంజెలిన్ రఘుపాత్రుని మాట్లాడుతూ ఒత్తిడిని నిర్వహించడానికి ఆచరణాత్మక మార్గాలను, నిర్దిష్ట పనిపై ఎలా దృష్టి పెట్టాలో వివరించారు. సమస్యలను పెద్దవిగా చేయడం కంటే సమతుల్య మనస్తత్వాన్ని కొనసాగించడం ప్రాముఖ్యతను ఎంవిజిఆర్ ప్రిన్సిపల్ వైఎంసి శేఖర్ వివరించారు. చాలా మంది వ్యక్తులు తమ భావాలను పంచుకోవడానికి సంకోచిస్తారని, ఇది తరచుగా మానసిక క్షోభకు దారి తీస్తుందని చెప్పారు. మొబైల్ ఫోన్లను అధికంగా ఉపయోగించడం వల్ల సామాజిక పరస్పర చర్యలు ఎలా తగ్గాయో వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సారా కమలా కుమారి, వివిధ విభాగాల డబ్ల్యుఇసి కోఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు అలవాటు చేసుకోవాలి




మాట్లాడుతున్న ఎడి మధుసూదనరావు

ప్రజాశక్తి-రామభద్రపురం

పంటల్లో మేలైన దిగుబడుల కోసం యాజమాన్య పద్ధతులు అలవాటు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఎడి మధుసూదనరావు సూచించారు. శుక్రవారం ఆరికతోటలో ఆత్మా ద్వారా వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో నత్రజని, భాస్వరం వంటి ఎరువులతో పాటు పొటాష్, జింక్, సూక్ష్మరకాల ఎరువులు వినియోగించుకోవాలన్నారు. ఎఒ శివ మాట్లాడుతూ రెండో దఫా ఎరువుగా ఎకరాకు 500 ఎంఎల్ నానో యూరియా ఉపయోగించాలన్నారు. అధికంగా పురుగుమందుల వాడకం వల్ల కలిగే నష్టాలు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంకి భీమయ్య, నల్ల కూర్మారావు, రైతు సేవా కేంద్ర సిబ్బంది రేవతి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహేశ్వరరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కొత్తవలస



రక్తదాతలను అభినందిస్తున్న అతిథులు

తుమ్మికాపల్లి వద్ద ఉన్న వాగ్దేవి విద్యాసంస్థల అధినేత కోటిన మహేశ్వరరావు జన్మదిన వేడుకలను శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో వంద మంది రక్తదానం చేశారు. 700 మంది విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీసత్యసాయి దివ్యామృతం కుమార్ స్వామిజీ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.విన్సెంట్, ప్రొఫెసర్ చంద్రమౌళి, సత్య విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపల్స్ సతీష్, సురేష్, లక్ష్మణరావు, రాజు కుమార్ పాల్గొన్నారు.

భూగర్భ శాస్త్రంలో ఉద్యోగావకాశాలు మెండు

ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ శ్రీనివాసన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భూగర్భ శాస్త్రంలో ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని సిటియు ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ శ్రీనివాసన్ అన్నారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో భూగర్భ శాస్త్ర విభాగం, స్కూల్ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో రెండు రోజుల భూగర్భ శాస్త్ర మ్యాపింగ్‌పై వర్క్‌షాప్ కమ్ ఫీల్డ్ ట్రైనింగ్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. వర్క్‌షాప్ ప్రాముఖ్యతను డాక్టర్ మన్నాల ప్రసాద్ వివరించారు. ప్రారంభోపన్యాసాన్ని భూగర్భ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సురేష్ బాబు అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ భూగర్భ శాస్త్రం విస్తృతమైన ఉద్యోగావకాశాలు కలిగిన కోర్సు అని, ఈ విభాగంలో విద్యాభ్యాసం చేయడం ద్వారా ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉద్యోగాలు పొందడమే కాకుండా, స్వంతంగా కన్సల్టెన్సీ సేవలను కూడా నిర్వహించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రధాన వక్తగా ఎయు భూగర్భ శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ కె. సత్యనారాయణ రెడ్డి కీలకోపన్యాసం అందించారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అవసరమైన అన్ని ప్రయోగశాల సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శాశ్వత క్యాంపస్‌కు మారిన అనంతరం మరిన్ని ఆధునిక పరికరాలను సమకూర్చేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్యవతమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-బాడంగి



సత్యవతమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న గ్రామస్తులు, టిడిపి శ్రేణులు

బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు మాతృమూర్తి తెంటు సత్యవతమ్మ అంత్యక్రియలను అశ్రునయనాల మధ్య శుక్రవారం నిర్వహించారు. ఆమె పార్థీవదేహాన్ని ఎమ్మెల్యే బేబినాయన, టిడిపి నేతలు భంజ్‌దేవ్, కొండపల్లి కొండబాబు, నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన టిడిపి కార్యకర్తలు సందర్శించి, నివాళు లర్పించారు. అనంతరం సంప్రదాయ పద్ధతుల్లో అంతిమయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

ప్రజాశక్తి-భోగాపురం

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తెలిపారు. శుక్రవారం పోలిపల్లిలోని తన నివాసం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించి కార్యకర్తలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూసమస్యలు, సిసి రోడ్లు, కాలువలు, ఎలక్ట్రికల్, గ్రామాల్లో మౌలిక వసతుల సమస్యలు, రీసర్వే తప్పులు, గ్రామ పంచాయతీల విభజన కోసం దరఖాస్తులు అందజేశారు.

కార్యకర్తలతో సమావేశం

పోలిపల్లిలో తన స్వగృహం వద్ద మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు టిడిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమస్యలను డిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో పూసపాటిరేగ మండల అధ్యక్షుడు మహంతి శంకర్రావు, రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ నీలపు అప్పలరామి రెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రౌతు స్వామినాయుడు, బూర్లె రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

కొల్లిపేట గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ వనం కనకమ్మ, కొల్లి రమణ పాల్గొన్నారు.

చంద్రబాబుకు అవార్డు పట్ల హర్షం

ప్రజాశక్తి-వేపాడ

సిఎం చంద్రబాబునాయుడుకు బిజినెస్ రిఫార్మింగ్ ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించడం పట్ల డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం మండలంలోని ఎకెజిపాలెంలోని తన నివాసం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ స్థాయిలో చంద్రబాబు నాయుడు విధానాలు అమలు జరిగే సాయికి ఎదిగారని తెలిపారు. చంద్రబాబు పాలన పట్ల ప్రపంచమంతా చర్చించుకోవడం ద్వారా ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్ర రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఎన్ఆర్ఐలు, పెట్టుబడిదారులు అత్యధికంగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని, అందుకు సిఎం చంద్రబాబు ప్రోత్సాహం, చొరవే కారణమని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి తన ప్రధాన ధ్యేయమంటూ వయసును కూడా పక్కనపెట్టి పనిచేస్తున్నారని కొనియాడారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - భోగాపురం

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని కవులవాడ వద్దనున్న అవంతి పాలిటెక్నికల్ కాలేజీలో టెక్ విజన్ 2కె-25 సాంకేతిక వైజ్ఞానిక వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి సాంకేతిక సదస్సులు విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి దోహదపడతాయన్నారు. ఎంఇఒలు ఎ.రమణమూర్తి, బి.చంద్రమౌళి మాట్లాడుతూ సాంకేతిక విద్య భవిష్యత్తుకు బంగారుబాట అన్నారు. బిఎస్ఎన్ఎల్ డిజిఎం డి.దాలినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.హేమ, అవంతి కళాశాలల ప్రతినిధి ముత్తం శెట్టి మహేష్, ఎఒ జి.అశోక్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపిలో 260 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టిడిపిలో చేరుతున్నారని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 19వ డివిజన్ లంకా పట్నంకు చెందిన సోము మురళీమోహన్ మాధవి ఆధ్వర్యంలో 260 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ పార్టీ అధ్యక్షులు గంటారవి, ప్రధాన కార్యదర్శి కోదండరాం, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, ఎఎంసి చైర్మన్ నర్సింగరావు, విజయనగరం పార్లమెంట్ మహిళా అధ్యక్షులు అనురాధ బేగం, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, అవనాపు విజయ్, గాడు అప్పారావు, పిల్లా విజయ్ కుమార్, కుటుంబరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లాడ్జీపై నుంచి జారి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

నగరంలోని గంటస్తంభం వద్దగల జాబిలి లాడ్జి పై నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా కాశీ బుగ్గకు చెందిన బత్తిన గోపాలరావు (50) విశాఖ పట్నంలో నివాసం ఉంటున్నాడు. వ్యాపారం నిమిత్తం గురువారం విజయనగరం వచ్చి లాడ్జీలో దిగాడు. సాయంత్రం లాడ్జి మొదటి అంతస్తు కారిడార్ నుంచి ప్రమాద వసాత్తూ జారీ పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-డెంకాడ

మండలం పరిధిలోని పోలీస్ స్టేషన్ సమీపంలో మోటార్ సైకిల్ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నాతవలస నుంచి విజయనగరం వైపు మోటార్ సైకిల్ డెంకాడ నుంచి విజయనగరం వైపు నడుచుకుంటూ వెళ్తున్న గుర్ల మండలం కెల్ల గ్రామానికి చెందిన ఉమ్మడాల అప్పలనర్సమ్మ (65)ను ఢీకొంది. వెనకనుంచి బలంగా ఢీకొనడంతో తలకు కాలుకు బలమైన గాయాలు తగలడంతో స్థానికులు వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో జిల్లాకేంద్రాస్పత్రికి తరలించారు. అప్పటికే మహిళ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె మనుమరాలు బంగారు మహలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రంలో ఒక వ్యాన్ నుంచి పొగ మంటలు రావడంతో అక్కడ ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. విజయనగరం నుంచి సాలూరువైపు వెళుతున్న వ్యాన్‌ను చెక్ పోస్ట్ తనికీల కోసం ఆపే సమయంలో వ్యాన్ ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికంగా ఉన్న ప్రజలు మంటలపై ఇసుక, నీరు చల్లి నిలువరించారు. స్థానికులు మంటలను అదుపు చేయకపోతే పెద్ద ప్రమాదమే జరిగేదని పలువురు అన్నారు.